# అదేనా....?


అయ్యగారి శ్రీనివాసరావు

అసలు రాగిణి తనకు పరిచయమై వుండకపోతే తను కూడా మామూలు మనిషిలాగా మాత్రమే వుండిపోయేవాడు. ఎవరి జీవితం ఎప్పుడు ఎలా మలుపు తిరుగుతుందో ఎలా మనసులోను, మనిషిలోను మార్పు వస్తుందో తెలియదు. చామంతి పూయాలంటే హేమంతమే రావాలి. మల్లెపూవు పూయాలంటే మండుటెండే కావాలి. అలాగే మనిషి గుండె లయబద్ధమవాలంటే అందం అరవిరిసిన లలనామణి పరిచయమే కావాలి. అనుకున్నాడు ప్రసేన్.

రాగిణి పరిచయమాయక ఇప్పుడనిపిస్తోంది. అసలిన్నాళ్లు గడిచింది కూడా ఓ జీవితమేనా?' అని.

అంతలోనే ఇప్పటికైనా మించిపోయిందేముంది? తనదృష్టవంతుడు కాబట్టే ఆమె తనకి పరిచయమైంది. అదృష్టవశాత్తు తన కొలీగైంది. తమ ఇద్దరి సీట్లూ ఆఫీసుతో సంబంధం లేకుండా సెపరేట్‌గా వుండడం కూడా తమ మధ్య సాన్నిహిత్యం పెరగడానికి, ఆ సాన్నిహిత్యం చనువుగా మారడానికి దోహద పడింది. అసలామె ధైర్యానికి ఆశ్చర్యమనిపిస్తుంది అప్పుడప్పుడు. ఒక మగాడని కూడా చూడకుండా సిగ్గు విడిచి అంతరంగిక విషయాలు కూడా చెబుతున్నదంటే అంతకంటే తననిష్ట పడుతున్నానని చెప్పడానికి వేరే సూచనలెందుకు..?

ఆమె ఊరెళ్లొచ్చిందారోజే. చనువుంది కదాని ఆమె నడిగాడు మరికొంచెం చనువు తీసుకుంటూ "ఏంటండోయ్ రాగిణి గారూ! ఏంటి విశేషం? కళ్లంత ఎఱ్ఱగా వున్నాయేంటి? రాత్రంతా కంటిమీద కునుకేలేదేంటి" అని. అంతటితో ఊరుకుంటే బాగుండేది. ఏదో వెర్రి ఆవేశం వచ్చినట్టు "అయినా వారంరోజుల విరహం తీరేటట్టు ఆనందాన్నంతా ఒక్క రాత్రిలోనే అనుభవించేసారేమిటి?" అంటూ అడిగాడు. చనువుగా వుంది కదాని ముందు, వెనక చూడకుండా అలా అడగడమైతే అడిగాడుగాని అడిగిన తర్వాత భయం పట్టుకుంది. అంత పచ్చిగా మాట్లాడినందుకు ఆమె ఏ అల్లరి చేసి యాగీ చేస్తుందోనని.



కానీ అతడి భయాన్ని దూరంచేస్తూ వినిపించాయామె మాటలు. నిరాశగా ధ్వనించిందామె స్వరం. "ఏమానందమండీ? మధ్య తరగతి జీవితంలో పుట్టిన నేరానికి అలాటి సరదాలు కూడానా?" అంది.

ఆ మాటలు విన్న ప్రసేన్ కొంత స్థిమితపడ్డాడు. దాంతో అంతవరకు అతడుపడ్డ భయం స్థానంలో కొంటెతనం ప్రవేశించింది. ఎదుటివారి బలహీనతని తన కనుకూలంగా మలచుకునే మానవనైజం, అందునా ఆడదాని బలహీనతని తనకనుకూలంగా మార్చుకునే మగబుద్ధి ప్రకోపించింది.

అందుకే అడిగాడు "ఏంటండీ అంత నిరాశగా మాట్లాడతారు. మీకేమిటి తక్కువని? చక్కనైన ఉద్యోగం, మంచి భర్త, పెద్ద జీతం, పిల్లా పాపా బాదరబందీ లేని జీవితం. మీరే అలా అంటే మరి మిగతావాళ్ల మాటేంటి?" అన్నాడు. అలా అంటే ఆమె మాటల్లోని నిరాశకు కారణం తెలుస్తుందని.

తన ఊహ నిజమే అయింది. ఆమె మాట నిరాశగా పలికింది. "ఏం ఉద్యోగమో ఏం జీతమో. జీవితానికి సుఖం లేనపుడు, అందునా వయసు వేడిమీద వున్నపుడు కోరికలు తీరనపుడు ఎంత డబ్బుంటే లాభమేంటి?" అంది ఆ మాటల్లో నైరాశ్యం స్పష్టంగా వినబడుతోంది.

ఆ మాట విన్న ప్రసేన్ ఉలిక్కిపడ్డాడు. "ఆమె ఆఖరున అన్నమాట సామాన్యంగా ఏ ఆడదీ పరాయి మగాడి దగ్గర పొరబాటున కూడా అనని మాట. అలాంటిది ఆమె తన దగ్గరన్నాదంటే-" ఏవో కొత్త ఆలోచనల్లో పడ్డాడు ప్రసేన్. అంతలోనే తేరుకుని ఆమె బలహీనత కనిపెట్టడంతో మరింత ముందుకెళ్లి కవ్విస్తూ "ఆనందంగా జీవించాలన్నా, ఖుషీగా వుండాలన్నా మనసే ప్రధానమండీ. అంతేగాని చిన్న చిన్న అడ్డంకుల్ని లెక్క చెయ్యకూడదు" అన్నాడు చాలా తేలికగా.

"ఔనండీ మీరు మగాళ్లు కాబట్టి ఎన్నైనా చెబుతారు. అత్తగారి పోరా? మామగారి పోరా? మీరిద్దరు. ఇద్దరే పిల్లలు మీకు. అలాంటిమీరు రసరాజ్యాలైనా ఏలుతారు. రసానందాలలోనై ఓలలాడతారు" అంది.

ఇంతలో ఏదో పనుందని ఆఫీసరునుంచి కబురు రావడంతో ఫైల్ పట్టుకుని ఆఫీసరు దగ్గరకెళ్లింది రాగిణి.

ఆమె అటు వెళ్లగానే ఆలోచనల్లో పడ్డాడు ప్రసేన్. 'పెళ్లయి ఏడాదైనా కాలేదు. అప్పుడే ఆమెలో అంత నైరాశ్యమా? దీనికి కారణమేమై వుంటుంది? కొంపదీసి భర్తగాని.....?' అనుమానం క్షణకాలం. అంతలోనే 'ఛ... అది కాకపోవచ్చు. అదేగాని నిజమైతే ఎప్పుడో బైట పడిపోను' పెద్ద రీసెర్చి స్కాలర్ లాగ తనకు తనే ఊహించేసుకున్నాడు. అంతలోనే మరో ఆలోచన. అందగాడు కాదా? అంటే అదీ కాదు. ఎందుకంటే తను చూసాడు ఆమె భర్తని. చాలా బాగుంటాడు. అసలు ఒకర్నొకరు ప్రేమించుకునేకదా పెళ్లి చేసుకున్నది.

రాగిణి ఆమె భర్త విజయవాడలో ప్రైవేటు కంపెనీలో పనిచేసేవారు. ఇద్దరి స్థాయీ ఒకటే కాబట్టి ఒకర్నొకరు ఇష్టపడి పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత వారి అదృష్టమో లేక దురదృష్టమోగాని రాగిణికి తమ సంస్థలో ఉద్యోగం వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా బ్రాంచీలున్న అతి పెద్ద సంస్థ కావడాన అన్ని సౌకర్యాలతోపాటు జీతం కూడా బాగానే వుంటుంది. అందుకే భర్తకి దూరంగా రావడమంటే కొంచెం కష్టమైనా ప్రస్తుతం ఆమె సంపాదించేదానికంటే నాలుగు రెట్లు ఎక్కువ జీతం కాబట్టి ఇక్కడికొచ్చి ఒంటరిగా వుంటోంది. అతడక్కడ, ఈమె ఇక్కడ. వారానికోసారి కలయిక, వారమంతా శనివారం రాకకోసం ఎదురుచూపు. సోమవారం అట్నుంచి వచ్చాక నిట్టూర్పు. ఇదీ ఆమె జీవితం. ఈమె బాగానే సంపాదిస్తోంది కాబట్టి బాగానే చూసుకోవాలి. కలుపుగోలు మనిషి. అంతేకాదు అందగత్తెల లిస్టులో పైవరసలోనే వుండే అందమామెది.

మొదట్లో అతడు పెద్దగా పట్టించుకోలేదుగానీ రాన్రాను ఆమె చనువువల్ల ఆమెలో వున్న ఏదో తెలియని ఆకర్షణవల్ల చనువు పెంచుకున్నాడు. క్రమేపీ ఇద్దరి మధ్యా సాన్నిహిత్యం పెరిగింది. ఒకరి స్వంత విషయాలు మరొకరికి చెప్పుకునే స్థాయికెదిగిందా స్నేహం. అయితే ఎంత అంతరంగిక విషయాలు చెప్పుకున్నా పడకటింటి సుఖంలోని వెలితి గురించి అంత డైరెక్టుగా చెప్పిందంటే... ఆమె ఉద్దేశ్యం...?

★★★

ముసుగులో ఇంకనవసరం. డైరెక్టుగా మాట్లాడినా ఇంక ఫర్వాలేదు. అసలామెకు తనమీద సంపూర్ణంగా... వుంది. అయినా తననుంచి ఏ స్పందనా లేదని కొద్దిగా ఆగుతున్నట్టుంది. లేకపోతేనా ఎప్పుడో స్వంతమైపోయేది. ఆమె మాటలు, ఆమె చనువు, ఆమె ప్రవర్తన ఇవన్నీ చూస్తూ తనెందుకాగడం ఇంకా? ఇవాళ ఎలాగైనా అటో ఇటో తేల్చేసుకోవాలి అలా ఆలోచిస్తున్న ప్రసేన్‌కి నిన్నటి సంభాషణ గుర్తొచ్చింది.

మాటల సందర్భంలో "మీ శ్రీవారు చాలా దురదృష్టవంతులు సుమండీ" అన్నాడు ప్రసేన్.

ఆమాటకామె కిలకిల నవ్వుతూ "ఎందుకండోయ్!" అంది.

"ఎందుకంటారేంటి? పోతపోసినట్టున్న ఈ అందాన్ని ఆస్వాదించకుండా, అమాంతం ఆలింగనం చేసుకోకుండా దూరంగా వుండిపోయారు కదా అంతకంటే దురదృష్టం వుంటుందా? అదేగాని ఇద్దరూ కలిసుంటేనా... రసరాజ్యాల నేలేద్దురుకదూ అన్నాడు.

ఆమాటకామె ముఖంమీద నవ్వు మాయమై ఆ స్థానంలో నిర్లిప్తమైన వైరాగ్యం చోటుచేసుకుంది. ఆస్థితిలోనే 'ఈజన్మకంత అదృష్టంకూడానా?' అంది.

దాంతో ఆసక్తి పెరిగిన ప్రసేన్ "ఏం? ఎందుకులేదు? మీరేమైనా ముసలాళ్లా? లేకపోతే అన్ని బంధనాలూ విడిచిపెట్టుకున్నవాళ్లా?" అడిగాడు.

"అదైతే ఏ బాధా లేకపోను. కానీ అన్నీ వుండి ఏమీ లేని పరిస్థితి. అయినా సిగ్గువిడిచి ఇలాటి సంగతులు ఎలా చెప్పుకుంటాం చెప్పండి. అయినా మన మధ్య ఆ చనువుంది కాబట్టి చెబుతున్నాను. ఉన్నది రెండు గదుల ఇల్లు. అందులోనే మాతోబాటు అత్తగారు మామగారు. వాళ్లకి మావారొక్కరే కొడుకు కావడంతో మరెక్కడికీ వెళ్లలేరు. వారానికోసారి కలిసేది మేము. కలిసుండేది కొన్ని గంటలు. ఆమాత్రం సమయానికే ఏకాంతం కోసం దేవులాటే. అయినా ఆశపడడమేగాని అది దొరకదు. దాంతో బలవంతపు బ్రహ్మచర్యం అవలంబించవలసి వస్తోంది!" అంది. అలా అంటూ ఆఖరికి అలా చేయవలసి వచ్చినపుడు ఆమె మానసిక పరిస్థితి కూడా విపులంగా చెప్పింది. ఆ ఆవేశంలో ఆ ప్రవాహంలో ఆమె ఆడదనిగాని, ఎదురుగా వున్నది మగాడనే స్పృహగాని మరిచిపోయిందామె.

అదంతా విన్న ప్రసేన్‌కి తన పరిస్థితి గుర్తొచ్చింది. ఆమెదా పరిస్థితైతే తనది మరో పరిస్థితి. నడివయసుకి చేరిన వయసు. బింకంమీదున్న కోరికలు. ఉన్నది మాత్రం తాతలనాటి రెండు గదుల ఇల్లు. దానికి తగినట్టు ఇంటినిండా సామాను. డిగ్రీ చదువుతున్న కొడుకు, ఇంటర్మీడియెట్ చదువుతున్న కూతురు. ఇద్దరూ ఎదిగిన పిల్లలు. అన్నీ తెలిసిపోయిన వయసు. అంతమందీ ఆ రెండు గదుల్లోనే సర్దుకోవలసిన పరిస్థితి. అందువల్ల ఏరకమైన స్పందన తమలో కలిగినా కూడా బైటపెట్టుకోలేని పరిస్థితి. పదకొండువరకూ లైటు వేసుకుని చదువుతూనే వుంటారు పిల్లలు. వాళ్ల భవిష్యత్‌ని దృష్టిలో పెట్టుకుని లైటార్పి పడుకోమనలేరు. అలాగని అంతవరకు ఆగలేరు. పోనీ ఆపైన ఏదో బాధపడదామంటే వాళ్లకి నిద్రపట్టిందో లేదో తెలియని స్థితి. దానికితోడు పగలల్లా చాకిరీ చేసి వుండడాన కూరుకుపోయే కళ్లు. అదీకాక ఎలాగోలా కక్కుర్తి పడదామన్నా ఎదురుగా ఎదిగిన పిల్లలు. లేదా వాళ్ల ఆలోచనలు. దాంతో తమ దంపతులది కూడా బలవంతపు బ్రహ్మచర్యమే. కాని ఎక్కడ చెప్పుకుంటాడు? ఎలా చెప్పుకుంటాడు? ఇప్పుడవకాశం దొరికింది. దాంతో రెండో ఆలోచన లేకుండా తన బాధనంతా ఆమె దగ్గర పరిచేసాడు. అలా చెబుతున్నపుడు నిజాయితీగానే చెప్పాడు. బాధగానే చెప్పాడు.

అప్పుడామె అన్నమాట "పక్కపక్క సీట్లయినందుకు ఇద్దరం ఒకే స్థితిలో వున్నామన్నమాట. ఉండీ లేకపోవడమంటే ఇదేనేమో!" అంది. అక్కడితో ఊరుకుంటే



'ఇన్నాళ్లు నాలోవున్న సంస్కారం ఏమైంది? ఆమె విషయంలో ఈమధ్య నేనెందుకంత నీచంగా ఆలోచించాను? ఆమె వయసేంటి? నా వయసేంటి? నడివయసుకు చేరిన నేను నా కూతురు వయసుకు దగ్గరగా వున్న ఆమె విషయంలో అలా ఆలోచించానేంటి?

బాగుండేది. కాని ఆ మాటల్ని పొడిగిస్తూ "అన్నమో, టిఫినో అయితే అక్కడో ఇక్కడో కక్కుర్తి పడతాం. డబ్బో వస్తువో అయితే అరువు తెచ్చుకుంటాం. కానీ ఇదలాకాదే..." అని. ఆ ఆఖరు మాటలన్నపుడతడు నిర్లిప్తంగా నవ్వుకున్నాడు అంతకన్న ఏమీ చేయలేక.

కాని తరచి ఆలోచిస్తే ఇప్పుడర్థమౌతుంది ఆ మాటల కర్థం.

'అసలు! ఆడది అంతకంటే సూటిగా ఇంకెలా చెప్పగలదు? ఇద్దరి పరిస్థితీ ఒకటే కాబట్టి ఇద్దరమూ కలుద్దాం రండి' అని అనిపించింది.

* * *

"నమస్తే ప్రసేన్‌గారూ!" ఆఫీసులోకొస్తూనే పలకరించింది రాగిణి. ఆమాటతో ఆమె ఆలోచనలతోనే వున్న ప్రసేన్ తలెత్తి ఆమెవైపు చూసాడు. రాగిణి ముఖంలో ఏదో తెలియని వెలుగు. ఏదో పొందబోతున్నామనే ఆనందం. అదే విషయాన్ని అడిగాడు. దానికామె జవాబుగా, "సార్! మీరు నాకొక సాయం చేయాలి" అంది. ఆ అడగడంలో చేస్తారో లేదోననే ఆతృత వుంది.

ఆమె ముఖంలో వుండే ఆతృత, ఆ అడిగే తీరు చూస్తూంటే జాలేసింది ప్రసేన్‌కి. అయినా ఎందుకైనా మంచిదని తొందరపడి మాటివ్వకుండా "ఏంటండోయ్ నేను చేయగల అంత గొప్ప సాయం. అయినా నా చేతుల్లో వున్నదైతే చేస్తాననుకోండి' అన్నాడు గోడ మీది పిల్లివాటంగా.

"మీరు చెయ్యగలిగేదేనండి. మరేంకాదు నాకో వారం రోజులు సెలవు కావాలి. మీరు బాస్‌కి చెబితే కాదనరనీ..." అంది నుసుగుతూ.

"ఎందుకండోయ్ అన్నిరోజులు సెలవు?" అన్నాడు నవ్వుతూ. అతడి మాటల్లో ఇప్పుడేరకమైన కొంటెతనమూ లేదు. దానికి కారణం ఆమె ఆతృతతో నిండిన అమాయకమైన మోమే.

అతడి మాటకి సమాధానం చెప్పడానికి ఒక్క క్షణం సంశయించింది. ఆ క్షణంలోనే ముగ్గులు సిగ్గుల మొగ్గలు తొడిగింది. ఆమె పరిస్థితి చూసి అతడూ తొందర పెట్టలేదు. కాని కొద్ది క్షణాల మౌనమనంతరం ఆమే అంది "మా అత్తగారు మామగారు ఊరెళుతున్నారు. వారంరోజుల వరకూ రారు" అంది.

ఆ మాట విన్న ప్రసేన్‌కి మొదట అర్థం కాలేదు. అందుకే ఏదో అనబోయాడు. అంతలోనే విషయం అర్థమై ఆగిపోయాడు. అతడి పెదవులమీద చిరునవ్వు మొలిచింది. అది చూసిన రాగిణి సిగ్గు మరింత ఎక్కువైంది. అదే స్థితిలో వున్న ఆమె ఏమీ మాటాడకపోతే బాగుండదనిపించి "ఎందుకు సార్ నవ్వుతున్నారు?" అంది తనూ నవ్వుతూనే.

"ఏం లేదు మధ్య తరగతి కుటుంబాలలో పుట్టినందుకు మనలాంటి వాళ్లం పడే బాధలు గుర్తొచ్చాయి. అందుకే ఇది ఏడవలేక నవ్విన నవ్వండి" అన్నాడు.

"మరేం చేస్తాం చెప్పండి పరిస్థితులకు తలవంచక తప్పదెంతటివారికైనా. పరిస్థితులు బాగులేకపోయినా సర్దుకుపోవడమేగాని ఏర్పరచుకున్న కట్టుబాట్ల బరి దాటి బరితెగించడం మన సంస్కృతిలోనే లేదు. అలాంటప్పుడు ఇలా వచ్చే అవకాశాలే అతి మధురంగా వుంటాయి. అందుకే ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలి. అంతవరకూ మీలాగ సహృదయంతో అర్థం చేసుకునే పెద్దలతో మనసులోని బాధల్ని పంచుకుంటే బరువు తగ్గుతుంది. ఎవరితోబడితే వారితో ఇలాటి మాటలు డిస్కస్ చేయడం కూడా ప్రమాదమే. అపార్థాలు చేసుకోవడానికి అవకాశం వుంటుంది. కానీ మీ దగ్గర నాకా భయంలేదు. అందుకే చనువుగా మెలుగుతున్నాను. మీతో మాట్లాడుతూంటే మండు వేసవిలో మర్రిచెట్టు నీడలో సేదదీరినట్టనిపిస్తుంది" అంది. ఆ మాటలు విన్న ప్రసేన్ చెంపమీద చెళ్లున చరిచినట్లయింది. దాంతో సిగ్గనిపించి ఆలోచనల్లో పడ్డాడు.

'ఇన్నాళ్లు నాలోవున్న సంస్కారం ఏమైంది? ఆమె విషయంలో ఈమధ్య నేనెందుకంత నీచంగా ఆలోచించాను? ఆమె వయసేంటి? నా వయసేంటి? నడివయసుకు చేరిన నేను నా కూతురు వయసుకు దగ్గరగా వున్న ఆమె విషయంలో అలా ఆలోచించానేంటి? అయినా ఒక్కపూట ఆకలికి అన్నం దొరక్కపోతే ఎంగిలి కూడు తినే నైచ్యానికి దిగజారిపోతారా ఎవరైనా? అలాగైతే ఈ కట్టుబాట్లు సంస్కారాలు ఎందుకు?' అని సిగ్గనిపించింది.

అతడి మౌనాన్ని చూసిన రాగిణి "సార్! నేనడిగిందానికి జవాబు చెప్పకుండా మౌనం వహించారేంటి?" అంది.

ఆ మాటతో ఈలోకంలోకొచ్చిన ప్రసేన్ "ఆ...హ... ఏమీలేదు. ఇన్నాళ్లకి మీకు మంచి అవకాశం దొరికింది. మీకు మంచి జరిగే అవకాశం వుంటే నా సహకారం తప్పకుండా వుంటుంది. పదండి ఆఫీసర్‌గారికి చెబుతాను" అంటూ ముందడుగేసాడు.

ఆమాటకి అతడ్ననుసరిస్తూ "థాంక్స్ సార్" అంది.

అలా అన్నపుడామె ముఖంలో వెలిగిన వెలుగును కొలిచే సాధనం ఏ శాస్త్రవేత్తా ఇంకా కనుగొనలేదు.

★